# మత్స్య సిరులు

**ఏడేండ్లలో 31,508 టన్నుల దిగుబడి**

**రూ.402 కోట్ల విలువైన చేపల విక్రయాలు**

- చేపల పెంపకంతో ఆర్థికంగా బలోపేతమవుతున్న మత్స్యకార కుటుంబాలు
- ప్రతి ఏటా మూడింతల ఉత్పత్తితో లాభాలు పొందుతున్న మత్స్యకారులు
- 5 వేల టన్నులకుపైగా దిగుబడి
- హైదరాబాద్‌తోపాటు స్థానికంగా చేపలను విక్రయిస్తున్న మత్స్యకారులు
- కులవృత్తులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకే చేపల పెంపకం పథకం



వికారాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాయి. గొల్ల, కుర్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గొర్రెలను పంపిణీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నది. గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించిన మత్స్యకారులకు మేమున్నామంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి భరోసాను కల్పించింది. ఇందులో భాగంగానే గత ఏడేండ్లుగా మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల పూడికతీత పనులు సక్సెస్ కావడం, చెరువుల్లో నీరు నిండుతుండడంతో చేపల పెంపకానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఏడు దఫాల్లో చేపల పెంపకం పూర్తి కావడంతో సంబంధిత చేపలను విక్రయించిన మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాయి. మత్స్యకారుల జీవితాల్లో నూతనోత్సాహం నింపిన సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఒక్కో చెరువులో రూ.లక్ష విలువైన చేపపిల్లలను వదలగా, వాటి విక్రయంతో రూ.ఒక్కో మత్స్యకారు కుటుంబం రూ.3-5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. అదేవిధంగా జిల్లాలో 95 మత్స్యకారుల సొసైటీలుండగా.. వీటిలో మూడు మహిళా సంఘాలు (ఆలంపల్లి, పరిగి, రంగంపల్లి) ఉన్నాయి. వంద శాతం సబ్సిడీతో పంపిణీ చేసిన చేపలను మత్స్యకారుల సొసైటీల ఆధ్వర్యంలో పెంచుతున్నారు.

## 4.73 కోట్ల చేపలు సబ్సిడీపై అందజేత

గత ఏడేండ్లుగా జిల్లాలోని చెరువుల్లో ప్రతి ఏటా చేపల పెంపకం పెంచుతూ వస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మత్స్యకారులకు ఏడేండ్లలో 4.73 కోట్ల చేపపిల్లలను బీఆర్ఎస్ ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో అందజేసింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 18.75 లక్షల చేప పిల్లలను, 2017-18లో 53.41 లక్షలు, 2018-19లో 25.99 లక్షలు, 2019-20లో 197 చెరువుల్లో 41.54 లక్షలు, 2020-21లో 555 చెరువుల్లో 98.64 లక్షలు, 2021-22లో 691 చెరువుల్లో 1.17 కోట్లు, 2022-23లో 692 చెరువుల్లో కోటీ 18 లక్షల చేపపిల్లలను వదిలారు. మొదట కేవలం 70 చెరువుల్లోనే చేపల పెంపకాన్ని ప్రారంభించగా, తదనంతరం ప్రతి ఏటా పెంచుతూ 700లకు పైగా చెరువుల్లో చేపల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా దళారుల ప్రమేయం ఎక్కువగా ఉండి నిజమైన మత్స్యకారులు నష్టపోవాల్సిన పరిస్థితి లేకుండా ప్రణాళికబద్ధంగా బీఆర్ఎస్ సర్కారు ముందుకెళ్తున్నది. జిల్లాలో పెంచిన చేపలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా హైదరాబాద్‌తో పాటు స్థానికంగా విక్రయిస్తూ లాభాలను పొందుతున్నారు. రవాణా ఖర్చులు కూడా పెద్దగా లేకపోవడం, పెట్టుబడి ఖర్చు లేకపోవడంతో మత్స్యకారులు అధిక లాభాలను పొందుతున్నారు. అదేవిధంగా చేపలను విక్రయించేందుకు 70 శాతం సబ్సిడీతో వాహనాలను కూడా ప్రభుత్వం ఇప్పటికే మత్స్యకారులకు అందజేసింది.

### చేపల పెంపకంతో దిగుబడి, ఆదాయం

| ఆర్థిక సంవత్సరం | దిగుబడి (టన్నులు) | ఆదాయం (రూ.కోట్లు) |
|---|---|---|
| 2016-17 | 3000 | 39 |
| 2017-18 | 3500 | 45.50 |
| 2018-19 | 4200 | 54.60 |
| 2019-20 | 4585 | 59.60 |
| 2020-21 | 5184 | 67.39 |
| 2021-22 | 4920 | 67.39 |
| 2022-23 | 6119 | 75.33 |

## ఏడేండ్లలో రూ.402 కోట్లకుపైగా ఆదాయం

చేపల పెంపకంతో ప్రతి ఏటా మత్స్యకారులు అధిక మొత్తంలో లాభాలను ఆర్జిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందజేసి మత్స్యకారులకు స్వయం ఉపాధి కల్పించడంతో ఆర్థికంగా వృద్ధి చెందారు. అయితే చేపల పెంపకంతో ప్రతీ ఏటా జిల్లా నుంచి 5 వేల టన్నులకు పైగా చేపల దిగుబడి వస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడేండ్లలో జిల్లావ్యాప్తంగా 692 చెరువుల్లో పెంచిన చేపలతో 31,508 టన్నుల దిగుబడి వచ్చినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారులు వెల్లడించారు. ఏడేండ్లలో చేపల విక్రయం ద్వారా రూ.402 కోట్లకుపైగా మత్స్యకారుల కుటుంబాలు లాభాలు ఆర్జించినట్లు సంబంధిత అధికారులు చెపుతున్నారు.

### జీవనోపాధి పొందుతున్నాం



మత్స్య సహకార సంఘాలకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసే పథకం ఎంతో బాగుంది. చేప పిల్లల పెంపకంపై ఆధారపడిన మత్స్యకారులకు ఇది ఆర్థికంగా తోడ్పాటును ఇస్తున్నది. నయాపైసా ఖర్చు లేకుండా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడం వల్ల చేప పిల్లల కొనుగోలుకు మత్స్యకారులపై ఆర్థిక భారం లేకుండా పోయింది. ప్రభుత్వం ఇచ్చిన ఉచిత చేప పిల్లలను జాగ్రత్తగా పెంచుకుంటూ పెద్దయిన తరువాత వాటిని అమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాం. ఉచితంగా చేప పిల్లలతో పాటు వాటిని పట్టడానికి వలలు, అమ్ముకోవడానికి ప్రభుత్వం వాహనాలను అందజేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికి వదిలేశాయి. చేప పిల్లలను మత్స్యకారులే డబ్బులు పెట్టి కొనాల్సి వచ్చేది. కేసీఆర్ సీఎం అయిన తరువాత మత్స్యకారుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వంలో మత్స్యకారులు సంతోషంగా జీవిస్తున్నారు.

**- లక్ష్మీనారాయణ, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, దుప్‌చెర్ల, బొంరాస్‌పేట**

### మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు



రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల కోసం చేసిన సంక్షేమంతో వారి కుటుంబాల్లో ఒక్కసారిగా వెలుగులు నిండాయి. గత కాంగ్రెస్, టీడీపీ సర్కారు పాలనలో మత్స్యకారులకు ఉపాధి లేక ఇతరు పనులు చేసుకొని కుటుంబాలను పోషించుకునేవాళ్లం. స్వరాష్ట్ర పాలనలో సీఎం కేసీఆర్ మత్స్యకారులకు ఎంతో మేలు చేశారు. ముఖ్యంగా చెరువు, కుంటల్లో పుష్కలంగా నీరు ఉండటంతో మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతున్నది. ప్రభుత్వం చేపపిల్లలను పంపిణీ చేయడం మత్స్యకారులకు వరంగా మారింది. పెరిగిన చేపపిల్లలను తిరిగి విక్రయించడంతో మంచి లాభాలు పొంది స్వయం ఉపాధి పొందుతున్నాం. మత్స్యకారుల సంక్షేమానికి ఎవరూ చేయలేని కృషిని సీఎం కేసీఆర్ చేశారు.

**- సంగెం రాజు, నానక్‌నగర్, యాచారం**

### మత్స్యకారుల జీవనోపాధి పెరిగింది



మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండంతో మత్స్యకారులకు జీవనోపాధి లభించింది. గత ప్రభుత్వాలు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసేవి కాదు. ఇలాంటి పోత్సాహకాన్ని అందిస్తున్న సీఎం కేసీఆర్ లాంటివారు రాష్ట్రానికి చాలా అవసరం. కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

**- అనంతయ్య, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, ముజాహిద్‌పూర్, కులకచర్ల**

### మత్స్యకారుల సంపద పెరిగింది



మత్స్యకారుల సంపద పెంచేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారు. మత్స్యకారుల కోసం ప్రాజెక్టులు, చెరువుల్లో చేపలను పెంచేందుకు చేపపిల్లలను పంపిణీ చేశారు. వారికి చేపలను అమ్ముకోవడానికి ద్విచక్ర వాహనాలతోపాటు నాలుగు చక్రాల వాహనాలు కూడా సమకూర్చారు. తాండూరు మండలంలోని జినుగుర్తి శ్రీరాములవారి ప్రాజెక్టులో చేపల పెంపకాన్ని చేపట్టాం. దీంతో మత్స్యకారుల సంపద పెరిగింది. మరోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయం.

**- శివరామ్, మత్స్యకారుల సహకార సంఘం, ప్రధాన కార్యదర్శి, జినుగుర్తి, తాండూరు**

### మత్స్యకారులను గుర్తించింది సీఎం కేసీఆరే..



గత ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోని మత్స్యకారులను సీఎం కేసీఆర్ గుర్తించారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి అనేక పథకాలను తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌ది. మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణి చేయడంతో స్వయం ఉపాధి దొరికింది. చేపలను దిగుమతి చేసుకోకుండా ప్రతి గ్రామంలో ప్రతి చెరువులో చేపలను పెంచి తాజా చేపలను ఎగుమతి చేసే స్థాయికి మత్స్యకారులు ఎదగడం ఎంతో సంతోషకరం. మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం చేపల వలలు, ద్విచక్రవాహనాలను ప్రభుత్వం ఉచితంగా అందజేయడంతో మత్స్యకారులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉన్నారు.

**- నూకం మహేందర్, నందివనపర్తి, యాచారం మండలం**

### సీఎం కేసీఆర్ కృషి మరువలేనిది



తెలంగాణలో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి మరువలేనిది. ఉమ్మడి రాష్ట్రంలో కుల వృత్తులను పట్టించుకున్న వారు లేరు. సీఎం కేసీఆర్ చేపట్టిన చేపల పెంపకం కార్యక్రమం వల్ల స్థానికంగానే చేపల కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నాయి. చెరువుల్లో లక్షల చేప పిల్లల్ని పెంచుతూ మత్స్యకారులకు ప్రభుత్వం చేదోడువాదోడుగా ఉంటున్నది. సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

**- మధు, శంకర్‌పల్లి**

### మత్స్యకారులకు సీఎం కేసీఆర్ అండగా..



మోమిన్‌పేట మండలం ఎన్కతల పెద్ద చెరువులో చాలా సంవత్సరాల నుంచి చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నాం. సరైన సౌకర్యాలు లేక అనే ఇబ్బందులకు గురయ్యాం. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి సంవత్సరం మత్స్యకారుల కోసం చెరువులో చేపపిల్లలను వదలడం చాలా సంతోషంగా ఉంది. చేపలను పట్టుకునేందుకు, అమ్మేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారు. చేపలను హైదరాబాద్‌లో అమ్ముకుంటున్నాం. ప్రభుత్వం మత్స్య శాఖ తరపున నాకు ఒక ద్విచక్ర వాహనాన్ని అందించింది. మత్స్యకారుల కోసం కేసీఆర్ కృషి చేయడం చాలా సంతోషంగా ఉంది.

**- మెట్టు రాములు, మత్స్య సంఘం ఎన్కతల గ్రామ అధ్యక్షుడు, మోమిన్‌పేట**